# సమీకరణం

-జైరాజ్

"తమ్ముడూ! నా రెండో కూతురు చిట్టికి బియ్యేడీగా ఉద్యోగమిచ్చి ఆ సాలూరే వేశారు. నీ వెలాగో ఆ ఊళ్ళోనే తగలడ్డావు గనక మంచిదయింది. అమ్మాయిని నేరుగా నీ వద్దకే పంపిస్తున్నాను. మంచేమిటో, చెడేమిటో అన్నీ నీవే చూసుకుంటావని ఆశిస్తాను. నీ వున్నావని అమ్మాయిని ఒంటరిగానే పంపిస్తున్నాను. అల్లుడేమో సెలవు దొరకలేదని రాశాడు. అయినా, అక్కడ నీవు ఉండగా, ఆయన ఎక్కడో తెనాలిలో ఉన్నవాడు ఇక్కడికి వచ్చి ఇక్కణ్ణుంచి పిల్లను తీసుకు వచ్చి నీ దగ్గర దిగబెట్టాలా? ఎందుకులే, అని నేనే అన్నాను. ఫలానా రోజు ఫలాని ట్రెయినుకి అమ్మాయిని బండి ఎక్కిస్తున్నాను. విజయనగరం వచ్చి అమ్మాయిని రిసీవ్ చేసుకో. ఒకవేళ ఏదేనా కారణంచేత నీవు రాలేకపోయావే అనుకో— అమ్మాయి కేం? నోట్లో నాలికలేనిదా? బస్సెక్కి నేరుగా అదే వచ్చేస్తుంది. బహుపరాక్" అని ఏలూరులో ఉన్న నరేంద్ర—సాలూరులో ఉన్న సురేంద్రకు రాసిన ఉత్తరం సారాంశం.

సురేంద్ర చేసేది పాడి గేదెలాంటి ఉద్యోగమే అయినా, పాలు పితకడం చేతగాని వాడు. అయితే, చేసేది పెద్ద హోదా ఉద్యోగం కనక, ఆయన ఏ లోటు లేకుండా ఖర్చు పెట్టుకున్నా, నాలుగు రాళ్ళు వెనక వేసుకో గలిగిన ఉద్యోగం.

సురేంద్రకు బంధుప్రీతి జాస్తి. అంతేనాకుండా ఎవరైనా తనను ఆశ్రయించాలే గాని, ఆయన ఒలికించే ఆప్యాయతగాని, చేసే సహాయంగాని నిష్కళంకమైనవి. అయ్యో! నా మీదపడి తిని పోయారే అని గాని, నా మీద ఇంత భారం మోపారే అని కాని వాపోయే బాపతుగాడు. సైగా సంబర పడిపోతాడు. ఎవరైనా బంధువులంటూ ఆ ఇంటికి రావాలేగాని, ఆ ఇంటిల్లి పాదికి అదొక పండుగ, వేడుక.

ఇలాంటి సురేంద్ర అర్ధాంగి అర్ధాంగంటే అర్ధాంగి. తగాచెండూ అంటే కూర్చున్నది కూర్చున్నట్టే ఉండిపోతుంది. లేచెండూ అంటే నిలబడ్డది నిలబడ్డట్టే ఉండిపోతుంది. పట్టిన కాయ బంగారం అని సురేంద్ర అనాలేగాని-'అలాగుండే!' అంటూ ఆ కాయే జరిపి ఆటలో ఓడి పోతుందిగాని, ఖటన్ గిటన్ అని కనీసం పచ్చీసులో కూడా వాదులాడదు.

అందుకని అలాంటి ఆ ఇంటికి వచ్చి పోయిన బంధు మిత్రు లెవ్వరూ ఎన్నడూ ఎందుకేగాని ఒక్కమాటైనా నొచ్చుకున్న వారు లేరు.

"మా ఇంటికి వస్తే ఇది పట్టుకు వస్తావు. మా ఇంటికి వస్తే ఇది పెడతాను" అనే బాపతేగాని, "మా ఇంటికి వస్తే ఏం పెడతావు? మా ఇంటికివస్తే ఏం పట్టుకువస్తావు?" అనే బాపతేకాదు ఆ దంపతు లిద్దరూ.

సురేంద్ర ఆప్యాయతనూ, ఆదరాన్నీ చూసిన వా రెవ్వరూ ఏ విషయంలోనూ ఆయన్ని వేలెత్తి చూపడంగాని, నిష్ఠూరమాడడం గాని ఎన్నడూ జరగలేదు. కాని, మొత్తానికి అత డేదో పాలు దండిగా పిండుకుంటున్నాడనే దురభిప్రాయం మాత్రం అందరిలోనూ ఉంది.

అయితే, నాలుగు రాళ్ళు కాదుగదా నాలుగు రాగి డబ్బులైనా వెనక వేసుకో లేదు సురేంద్ర అన్నది అక్షరాలా నిజం.

జీతపు రాళ్ళు ఊరుతూ ఉంటే ముప్పై బారల చేంతాడుతో చేదుకో వడం జలగడగడం తప్ప, 'గూనాబానా నింపుకుందాం, ఓ పూట తాడు తెగినా ఆ పూటకు ఇబ్బంది ఉండదు' అనుకునే రకం కాదు సురేంద్ర.

ఏమయ్యా నీ విలాగ? — అని ఎవరైనా అడిగితే? ( మిత్రబృందంలో సుమండీ ) —

"రిటైరైతే వచ్చే ఆ గ్రాట్యుయిటీ, విరుపుకున్న ఆ ప్రావిడెంటు ఫండూ, వచ్చే ఆ పింఛనూ... ఇవన్నీ చాలవా ఏమిటి? ఆ నాటికి నా బిడ్డలు ఎదిగి వచ్చి ఎవరి దారి వారైతే నాకూ, నా పెళ్ళానికీ అదే మస్తు. ఓ వేళ మధ్యలో నేను ఠపామన్నా, నా పెళ్ళానికే అవన్నీ వస్తాయోయ్" అని ధీమాగా అంటాడు సురేంద్ర.

"పెళ్ళీ, పేటాకులూ, పెట్టుపోతలూ అంటూ వస్తాయోయ్—వాటికోసమైనా కాస్తంత ముందు చూపు ..." అని ఎవరైనా నసిగితే —

"అబ్బాయ్! నాకు మూడు ప్లస్‌లు, మూడు మైనస్‌లు. కాబట్టి పాత బాణీలో నైతే ఖర్చు సున్నా, కొత్త బాణీలోనైతే ప్లస్సూ నై, మైనస్సూ నై అన్నారు కనక ఖర్చూ నై. విందులూ, వేడుకలూ అంటావా? అవి నిత్యం నా ఇంట్లో జరిగేదే. అయినా, నా బంధువులూ నా బలగం నాకు లేరేమిటి?" అని అడుగుతాడు ధీమాగా.

ఇదీ సూక్ష్మంగా సురేంద్ర విషయం.

చిట్టి అని నరేంద్ర సూచించిన ఆ అమ్మాయి అసలు పేరు నవీన.

"నవీన వస్తుందోయ్. ఇక్కడే ఉద్యోగమైందిట. గుడ్, గుడ్" అన్నాడో, లేదో

"ఎప్పుడండీ? ఏం ఉద్యోగం?" అని అడిగేసింది అర్ధాంగి.

"ఎప్పుడు నాన్నా? ఈ వేళే?" అని ఎగిరి గంతేశారు పిల్లలు.

"ఈ వేళ కాదురా. రేపు శనివారం. అయ్యవార్లమ్మా! సరేగాని ఆ తూర్పుగది దానికి కేటాయించు. ఒరే పెద్దాడా! నీవూ, చిన్నిగాడూ ఓగదిలోకి సర్దుకోండి" అన్నాడు సురేంద్ర.

"అలాగే, నాన్నా" అని పెద్దాడు అన్నాడో, లేదో "బావకూడా వస్తున్నాడా, నాన్నా?" అని అడిగింది చిన్నారి.

"ఇప్పుడు రావడం లేదుగాని, పెళ్ళాం అంటూ ఇక్కడ ఉన్నాక రాకుండాపోకుండా ఉంటాడుటే?" అని నవ్వాడు సురేంద్ర, కూతురు ఆ మాటెందు కడిగిందో గ్రహించి.

• • •

శనివారం వచ్చింది. చిట్టి వచ్చింది.

విజయనగరంలోనే 'హాయ్ బాబాయ్' అన్న చిట్టి ఇంటికి రాగానే—"హాయ్ చిన్నమ్మా, హాయ్ పెద్దాడా, హాయ్ చిన్నాడా, హాయ్ నడివాడా, హాయ్ చిన్నారీ, హాయ్ సన్నారీ, హాయ్ సొడగారీ" అని పేరు పేరున అందర్నీ పలకరించింది.

వెధవాయిలు ఆరోహణ క్రమంలో గాని అవరోహణ క్రమంలోగాని నిలబడకుండా, గుమిగూడారు సరి!

పెళ్ళంత సందడి జరిగితే పక్కింటి వాళ్ళూ సణుక్కున్నారు కూడా డిస్టర్బెన్స్ అని. చెప్పొద్దూ—గొడవ మోతాదుకి మించే జరిగింది.

అమ్మాయి ఉద్యోగంలో జాయినయ్యింది.


రెండు రోజులు పోనిచ్చి "బాబాయ్" అంది నవీన.

"క్యా హై?" అన్నాడు బాబాయి.

"స్టౌ తెచ్చుకున్నాను, బాబాయ్!"

ఇష్టా గోష్ఠి

చిత్రం— పి. రాజేంద్రప్రసాద్ (పాత గుంటూరు—1)



నసిగింది నవీన.

"స్టుప్వ్!" ఆశ్చర్యాన్ని ప్రకటించాడు సురేంద్ర.

"అదే, బాబాయ్! కారప్పొడి కూడా డబ్బాడు పెట్టింది మా అమ్మ." చెప్పేసింది నవీన.

"కంది పొడో?"

"అదీను."

"గోంగూర పచ్చడి?"

"ఎస్, బాబాయ్."

"ఆవాల్జీలక్కర మెంతులు?"

"ధనియాలు ఉల్లివెల్లుల్లి, అన్నీను."

"ఓ యబ్బో!"

"నా అబ్బ బాబాయ్. పడిబియ్యం, పడి పప్పు, పడి."

"స్టాప్. స్టాప్. పడొద్దు చిట్టీ, పడొద్దు. మీ బాబొక ఫూలు. ఇవన్నీ మీ బాబు చేసిన ఏరేంజిమెంట్సేనా?"

"యా, బాబాయ్."

"స్ సో!"

"ఐ సెడ్ సో, బాబాయ్."

"అవు, అమ్మడూ, అవు' మీ బాబు వట్టి ఫూలు. మీ అమ్మనీ ఆ మాటే అనాలి గానీ, అన్నేను గాబట్టి నీవైనా ఫూలువి కాకుండా అవన్నీ మరిచిపో. నా ఇంట్లో నా అన్న కూతురు వచ్చి వేరే కాపురం పెడుతుందా? వీళ్లేదు నాన్సెన్స్!"

"బా ... బాయ్!"

"నేనమ్మా. ఉప్పు లేదు, పప్పు లేదు అన్న బెంగ నీ కొద్దు. ఉల్లిపాయలు తరగాలన్న బెడదా నీ కొద్దు. నేనుండగా నీ కా బాధలన్నీ ఎందుకమ్మా? మీ బాబుకి బుద్ధి లేదు."

"అది కాదు, బాబాయ్."

"ఏది కాదు?"

"అదే ..."

"నస్ చప్."

"అలాగే, బాబాయ్."

• • •

అలాగే నవీన ఆ ఇంట్లో కలిసి పోయింది.

"ఉద్యోగమంటే అల్లాటప్పా? నీ కింకో నాలుగు చీరలన్నా ఉండాలి" అని సురేంద్ర నాలుగు చీరలు తెచ్చి వాట్టాడు.

"రెండు దగ్గర మళ్ళీ ఆ కక్కుర్తేమిటి? తెచ్చేవి అరడజనన్నా తేక" అని అర్ధాంగి జోకేసింది.

"నివ్వు మరీను, చిన్నమ్మా!" బుంగ మూతి పెట్టింది నవీన.

"అదేమిటమ్మా డజ నక్కేదనా?" నవ్వాడు సురేంద్ర.

"నువ్విలా ఉడికించావంటే నా కొక్కటి కూడా వద్దు. అయినా, పెట్టు పోతలంటే ఒకటీ అరాగాని, ఏకంగా డజన్లు డజన్లే?"

"సరేలేవమ్మా. ముందు నచ్చాయో, లేదో అది చెప్పు. నా సెలక్షనంటే మీ చిన్నమ్మ చాటుగా మూతి విరుస్తుం దెప్పుడూ."

"చాల్లెండి. మీరు మరీను. అది సరే గాని, నవీన్మా! వీలుచూసుకుని అల్లుడు గారిని ఒకమాటు రమ్మని రాయక పోయావా?" అని మాట మార్చింది సురేంద్రి.

"వీలుగాడే—అతడు చూసుకోవలసింది లేవు!"

"ఏదో ఒకటి లెండి. అబ్బాయిని ఒకమాటు వచ్చి పొమ్మని మీరైనా రాయండి."

"నేనా? ఒసేవ్ పిచ్చి! ఈపాటికది ఓ డజనుసైగా రాసే ఉంటుంది. ఏమే అమ్మడూ?"

"ఫో, బాబాయ్!"

"నే నెక్కడికీ పోనుగాని, మళ్ళీ ఒక రిమైండయ్."

"పొద్దున్నే ఒకటి పోస్టులో వేసొచ్చా, నాన్నా! ఇదీ ... ఇదీ ... ఇది తొమ్మిదో..." అన్ని చిన్ని ముగించక ముందే—

"ముంబ్యరా, భడవా" అంటూ వా ణ్ణో మొట్టు మొట్టింది నవీన.

"నా పని ఇక్కడ బేషుగ్గా ఉంది గాని, నీ విక్కడ లేకపోవడమే విసుగ్గా ఉంది" అని రాసే ఉందేమో నవీన— ఆఖరి ముడు ఉత్తరాలు అందుకోకుండానే వచ్చేశాడు గౌతమ్.

"బావొచ్చాడు. బావొచ్చాడు ... బావొచ్చాడు ..." పిల్లలు వరసగ్గా అనేశారు.

ఇటు దిరిగి కూర్చున్న నవీన అబద్ధం అనుకుంది.

"నిండా నూరేళ్ళాయుష్షు ... మాట లోనే వచ్చేశావయ్యా" అని చిన్నమ్మ అంటుంటే— "నిజమే అనుకొని అటు దిరిగింది నవీన. ఆ మాటే బాబాయ్ అని ఉన్నా నమ్మేది కాదు నవీన.

"నమస్కారం, అంకుల్" అని అందర్నీ వదిలేసి సురేంద్రనే ముందుగా పలకరించాడు గౌతమ్.

మళ్ళీ పెళ్ళంత సందడి జరిగి పోయింది. పక్కింటి వాళ్ళకు కడుపు రగిలిపోయింది.

మొగుడూ, పెళ్ళాలు ఆ రాత్రి ఏం మంతనా లాడుకున్నారో, మరునాడు పొద్దుటే ఇద్దీ సేవిస్తున్నప్పుడు —

"అంకుల్" అన్నాడు గౌతమ్.

"చెప్పు, గౌతమ్!"

"మరేమో ... మీరేమో ..." మాటలు మింగుతున్న గౌతమ్‌ని మోచేత్తో పొడిచింది నవీన.

ఆ పోటు తిన్నాక గడగడా చెప్పాడు



పొలం పని చిత్రం— ఎస్. సాంబశివరావు (హైదరాబాదు)

గౌతమ్.

"నవీనను మీ ఇంట్లోనే ఉంచేయడం బాగోలే దంకుల్. ఐ మీన్ వంట విషయంలో, అంకుల్! తను వేరేగా వండుకుంటే మంచిది. ఏమంటా రంకుల్? ప్లీజ్."

"అబ్బాయ్! ఇది నీ పుర్రెన పుట్టిన బుద్ధి కాదు. చూస్తూనే ఉన్నానుగా మోచేతి పోటు. అమ్మడూ! అసలు సంగతేమిటో చెప్పు" అన్నాడు సురేంద్ర, కాస్త కోపంగా.

"అదిగాదు, బాబాయ్" అని ఆగింది నవీన.

"ఆ మాట నీకు ఊతపదం గాని, ఏది కాదో చెప్పు."

"అదే, బాబాయ్!" మళ్ళీ ఆగింది నవీన.

"అయితే, వేరుగా వండుకుంటా నంటావ్?"

"శే, బాబాయ్! అది మంచిది, బాబాయ్!"

"ముయ్యవే నోరు."

"ముయ్యను, బాబాయ్!"

"అయితే, చెప్పు."

"చెప్పానుగా, బాబాయ్!"

"వద్దన్నానుగా?"

"బాబాయ్ ..." బేలగా చూసింది నవీన.

"అయితే, ఇక్కడ నీ కేదో లోటు జరిగిందన్న మాట?"

"నో, అంకుల్! నో, నో ..." గాభరా పడ్డాడు గౌతమ్.

"అంతే అయ్యుండాలి మరి!" వంత పాడింది సురేంద్రి.

"నో, ఆంటీ! నో, నో ..." అన్నాడు మరీ గాభరాగా గౌతమ్.

"మరి?" ప్రశ్నించాడు సురేంద్ర.

"నువ్వు మరీను, బాబాయ్! విన్నవనైనా అనన్రా ఆ మాట? ... నేనే ఏందుకైనా మంచిదని ..." అన్నది నవీన.

"ఆ ఎందుకు ఏమిటో చెప్పమనే నే నడుగుతూంట."

"అదే బాబాయ్. ఇప్పు డన్నీ బాగా ఉన్నా, ముందు కేదైనా ..."

"ఇప్పటికే ఏదైనా?"

"లేదు లేదు, బాబాయ్! లేదు బాబోయ్ లేదు."

"మరెందుకే ఈ గొడవంతాను?"

"ఎందుకంటే, మరీ ... మరీ ... అడ్డు తగలకు, బాబాయ్, న న్నంతా చెప్పనీకు పోనియ్. నేను నాలుగు రాళ్ళు సంపాదించుకుంటున్నానా? నీ వేమో పిల్లల వాడివి. నీ మీద పడి తినడం న్యాయమా? అహ, విషయం చెబు తాను. నీ నా మా టంటావని గాదు. చిన్నమ్మా అనదనుకో. చూసేవా ళ్ళేమం టారు? తేరగా తింటుం దనరూ?! అంటారు, బాబాయ్, అంటారు. నీకు తెలియదు. అంటారు. అంతేగాదు, బాబాయ్! నాకేం దొచ్చుదాయా? నడుం వంగదా? నడ్డి వంగదా? సోలడు గింజలు ఉడకేసుకోవడం. అంతేనా? అదీ చేసుకోకపోతే నిజంగానే రేప్పొద్దున్న నాకు నడుం వంగదు! బద్దకం అలవాటవు తుంది. కాదా, బాబాయ్?"

"అలాగ్గా, అమ్మడూ? అయితే. మా అందరికీ వార్చి నీవే వడ్డించు—చేతినిండా పని." కసిగా అన్నాడు సురేంద్ర.

"నన్ను చెప్పనీకుపోనియ్, బాబాయ్? ఇంకా ఉంది చాలా. నేనుగాకుండా తనూ సంపాదిస్తున్నాడా? నీ మీద భారం మోపడం సబబుగాదని ఇందాకే చెప్పాను. దాందేముంది? పోనీ పాతికో పరకో నీవే ఇమ్మని కూడా నీ వంటావు. ఇస్తానే అనుకో. కాని, అది అసలే బాగుండదు. నీ ఇంటిని పూటకూళ్ళ ఇల్లుగా అథోగతికి దించలేను. పైగా, బాబాయ్, నా పుట్టుకు నాకు ఏదో అదనీ, ఇదనీ తినాలని ఉంటుంది, నా కోరిక మేరకు ఏదో వండుకుతింటే దాని దారెలా ఉంటుంది చెప్పు?"

"నవీనమ్మా! అయితే నీకోసేసుకున్నా పుటే?" ఆశ్చర్యంగా అడిగింది సురేంద్రి.

"ఫో, చిన్నమ్మా!" సిగ్గు పడింది నవీన.

"అదేం గాదులే, ఆంటీ! అంకుల్! చెప్పానుగా. ఏదో తన వంట తాను చేసుకుంటే మంచిది ..." ముగింపు సూచించాడు గౌతమ్.

"సర్లేనయ్యా, అలాగే కానియ్" అన్నాడు సురేంద్ర భారంగా.

"థాంక్యూ, బాబాయ్, థాంక్యూ. కాని, బాబాయ్, ఇప్పటికేమీ అనుకోకు. ముందు ముందుకిచాలా మంచిదిబాబాయ్! మనకీ మనకీ ఏ భేదాభిప్రాయాలు రావు చూడు. నే నన్నాను చూడు" అన్నది ఆనందంగా నవీన.

"నా కా భయం లేదులే, అమ్మడూ! కాని, ఏమిటో నీవు చాలా ఎదిగిపోయావే. 'నే నింకా పసివాడిగానే ఉన్నానా?' అన్న సందేహం నాలో కలిగించావు" అని నిట్టూర్చాడు సురేంద్ర.

• • •

స్టౌ ముట్టించింది నవీన.

"బాబాయ్! నా కూర రుచి చూడు" అన్నది నవీన.

చూసి—"వింతైన వంటకంబు" అని మెచ్చుకోలుగా అన్నాడు సురేంద్ర.

"బాగోలేదా, బాబాయ్?" నీరుగారి పోయింది నవీన.

"హ హ హ్హా నాకే ముందు" అని పాడాడు సురేంద్ర.

పొంగిపోయింది నవీన.

రోజులు దొర్లు తున్నాయి.

ఏ అరమరికలు లేకుండా వేరుగా వండుకున్నా, ఆ ఇంట్లో కలిసిపోయింది నవీన.

తన కే వస్తువు లోటు వచ్చినా—"ఉప్పేచ్ ..." అనేది

"ఉందోచ్ ..." అంటూ ఎవరో ఒక రిచ్చే వారు, వీళ్ళింట్లోనూ ఏదైనా లేకపోయినప్పుడు. "చింతపండూ...?" అనేవారు ఎవరైనా.

"ప్రజెంట్, సార్..." అనేది నవీన.

ఇచ్చింది అప్పుగాను పుచ్చుకున్నది బదులుగాను ఎవ్వరూ ఎప్పుడూ లెక్కలో వేసుకోలేదు.

• • •

ఓ సుప్రభాతాన నవీన ముంగిట వాకిట్లో ముసగదీసుకుని కూర్చుంటే, ఆఫీసుకు పోతున్న సురేంద్ర వాకిటుంది గాబోలనుకుని పొరపాటుపడిపోయి పలక రించకుండానే ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

మోకాళ్ళ మధ్యలో ముఖం దాచు కుని బెక్కుతున్న నవీన సురేంద్ర వెళ్ళడం గమనించలేదు.

సురేంద్ర అటు వెళ్ళిన పది నిమిషా లకు గుండెలో పోటెక్కువై 'బాబాయ్' అని గావుకేక పెట్టింది నవీన.

"ఏమిటి, తల్లీ?" అంటూ వచ్చింది సురేంద్రి.

"నొప్పి, చిన్నమ్మా ... గుండెలో ... బాబాయేడీ?"

"అయ్యో, ఇప్పుడే ఇటుగానే గదమ్మా వెళ్ళారు."

"చిన్నమ్మా, బాధ జాస్తిగా ఉంది."

"ఫరవాలేదమ్మా. మీ బాబాయికి కబురు చేస్తాను. భయపడకు."

మాటల సందర్భంలో గౌతమ్, నవీన ఒకసా రప్పుడో లోగడ ఒక మాటు నవీనకు గుండెలో నొప్పి వచ్చిందనీ, హాస్పిటల్‌కి వెళ్ళే అంత గాభరా చేసిందనీ, అక్కడికి వెళ్ళాక అక్కడా ఆపరేషన్ అన్నారనీ, అయితే, నిమ్మళించాక ఇప్పు డిప్పుడే అవసరం లేదని వారే అన్నారనీ, నాలుగు మొక్కులు మొక్కుకున్నాక ఆ నొప్పి మళ్ళీ రాలేదనీ చెప్పారు.

అదంతా గుర్తు వచ్చి సురేంద్రి ఆఘమేఘాల మీద సురేంద్రకు కబురు చేస్తే ఆదరాబాదరా పరుగెత్తుకువస్తూ, దారిలోనే డాక్టర్ని కలిసి, వెంట వేసుకు వచ్చాడు సురేంద్ర.

---

**జీవన నాటకం**

**మానవ జీవితం పెద్ద రంగ స్థలం. మనకు ప్రేక్షకులు సాటి మనుషులు కారు. భగవంతుడు, దేవతలు నిజమైన ప్రేక్షకులు.**

—పైథాగరస్

• • •

**పాపం**

**పాపం చేసి పశ్చాత్తాపం చెందడంకన్న అసలు పాపం చేయకుండా ఉండడం గొప్ప.**

—ఆంబ్రోస్

• • •

**వివేకం**

**భగవంతుడు మన తప్పుని చూపి శిక్షించేలోగా, మన తప్పుని మనమే గుర్తించి చక్కదిద్దుకోవడం మంచిది.**

—అగస్టిన్

---

చెవులతో కాస్సేపు, చేతులతో కాస్సేపు పరీక్షించి, రెప్పలు తెరిచి చూసి, నాలుక చాపించి, ఏమిటి పాత కథ? అని అడిగి నవీన కొంత చెప్పాక మూది ఒకటి పొడిచేసి, "ఇప్పటికి వచ్చిన ఫర్వా ఏం లేదు. ముందుకి మాత్రం కొంచెం జాగ్రత్త అవసరం. షినీడ్స్ సమ్ రెస్ట్" అనేసి నాలుగు మాత్రలు రాసేసి, పూట కొకటి వేసి, పథ్యం లేదని చెప్పేసి వెళ్ళి పోయాడు డాక్టర్.

ఇంజక్షన్ వేస్తున్నప్పుడు భయం కొద్దీ నవీన గుడ్లు తేలవేస్తే—"అయ్య బాబోయ్, ఇదేమిటే వ్యాధి లక్షణం?" అని గాభరా పడిపోయిన సురేంద్ర నాలుగు మూలలకీ 'టెలిగ్రాములు' చేశాడు.

పోలోమంటూ వదిన గారు. ఆ వెనక గౌతమ్ రానే వచ్చారు.

వచ్చీ రాగానే—"నా తల్లోయ్, ఎంత చిక్కిపోయావే?" అని నవీన తల్లి బావురుమంది, నవీనను వాటేసుకుని.

"ఏం అంకుల్, డాక్టరే మన్నాడు?" అడిగాడు గౌతమ్.

"ఫర్వాలే దన్నాడయ్యా. అయినా, మొన్నంటే గాభరా పెట్టింది గాని, నిన్నా ఈవేళ బాగానే ఉంది" అన్నాడు సురేంద్ర.

ప్రశ్నలు సమాధానాలతో ఆ పూట గడిచింది. ఎప్పటిలాగా నవీన హుషారు గానే ఉంది.

పొరుగింటి పొట్టావిడ ఏదో పంటు చూసి నవీన తల్లిని వాళ్ళింటికి ఆహ్వా నించింది.

ఆ మాటా, ఈ మాటా చెప్పి, కప్పుడు కాఫీ ఇచ్చి—"ఇంటా బయటా చాకిరీ అంటే ఎవరికైనా కష్టమేనమ్మా. అయినా, ఏనుగంత బాబా యున్నాడు. ఎందుకు? దండుగ! ఒక్క పిల్ల తన దగ్గిర తింటే తరగి పోతుందని వేరె ట్టాడు. పెద్ద మనిషి. ఏం మనుషులో, బాబూ" అని అంటించింది.

'నిజమే సుమా' అనిపించింది సురేంద్ర వదినె గారికి.

తిరిగి వెళ్ళిపోయేటప్పుడు కూతు రుతో "కావాలంటే సోలెడు బియ్యం, గిద్దెడు పప్పు, చిటికెడు ఉప్పు నానే ఇమ్మంటుంది. కాస్త ఉడకేసి పెట్ట మయ్యా అంటాను మీ బాబాయ్‌తో" అన్నది సురేంద్ర వదిన.

నిర్ఘాంతపోయిన నవీన—"వద్దమ్మా, వద్దు. బాబాయి ఏమన్నాఅనుకుంటాడు" అనగలిగిందే గాని, ఎక్స్‌ప్లెయిన్ చేయ డానికి వ్యవధిలేకపోయింది.

పోతూ పోతూ అంత మాటా అనేసి వెళ్ళింది సురేంద్ర వదిన.

"అలాగేలే, వదినా" అంటూ నవ్వాడు సురేంద్ర.

ఖిన్నురాలైంది నవీన.

• • •

ఆవేళ స్టౌ అంటించబోయింది నవీన.

"వద్దమ్మా, వద్దు" అని వారించాడు సురేంద్ర.

"హ హ హ్హా—నాకే ముందు అని నీవు అనకపోతే నా కదోలాఉంటుంది, బాబాయ్" అని కంట తడి పెట్టింది నవీన.

"తప్పమ్మా, ఏడవకు" అంటూ కంటినీకు బాబాయ్ తుడుస్తూంటే—

"నే నింకా పసిదాన్నే, బాబాయ్" అంటూ బావురుమంది నవీన. *